వేటూరి పాటలు సాహితీ సౌరభాలు

బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

చిక్కడపల్లి: వేటూరి పాటలు సాహితీ సౌరభాలని.. ప్రతి పాట ఒక వజ్రం అని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. త్యాగరాయ గానసభలో సోమవారం సాయంత్రం స్వర కల్యాణి ఆర్ట్స్ నిర్వహణలో 'ఇది నా ప్రియ నర్తన వేళ'శీర్షికన వేటూరి సుందరరామమూర్తి రచించిన సినీగీత గానం జరిగింది. స్వర కల్యాణి, స్వర భాస్కర్, రామలక్ష్మి, జయరాం, జ్యోతి లత తదితరులు పాడిన పలు వేటూరి పాటలు మధురంగా ఆలపించారు. నాట్య గురువు నిహారిక శిష్య బృందం నైనిక కిరణ్ తదితరులు ఆరిగిరి నందిని దుర్గా స్తుతినీ మనోహరం నర్తించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కృష్ణ మోహన్‌రావు పాల్గొని కళాకారులను అభినందించారు. వేదికపై కిన్నెర రఘురాం, శశిబాల, రఘురాం బద్రీనాథ్, శేఖర్, రామచంద్ర రావు, రాధాకృష్ణ, వెంకటస్వామి, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


స్వర కల్యాణి, స్వర భాస్కర్‌లను సన్మానిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, రఘురాం

దేశ సమైక్యతకు కృషి చేసిన మహనీయుడు

సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్

చిక్కడపల్లి: ఉక్కు మనిషి సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ దేశ సమైక్యతకు కృషి చేశారని వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి వారసురాలు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శాంతాబాయి అన్నారు. సూర్యాపేటకు చెందిన సాంస్కృతిక సంస్థలు హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధూ ఆర్ట్స్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు. త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమానికి శాంతాబాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పలువురికి సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, దైద వెంకన్న, అమృతపూజి రేవతి, అనిత, హామీద్‌ఖాన్, ప్రభాకర్, సురేష్‌బాబు, ఏనుగు మమతారెడ్డి, అశోక్ రాణి, ప్రవీణ్, మల్లేష్, వెంకన్న, దివ్యమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి వారసురాలు శాంతాబాయిని సన్మానిస్తున్న శంకరం,వెంకన్న

రాణీ దుర్గావతి ధైర్యసాహసాలు మహిళలకు ఆదర్శం

నారీ శక్తికి ప్రతీక పుస్తకావిష్కరణ సభలో వక్తలు

చిక్కడపల్లి: వీరనారి రాణీ దుర్గావతి ధైర్యసాహసాలు మహిళలకు ఆదర్శప్రాయమని వక్తలు అన్నారు. రాణీ దుర్గావతి 500 సంవత్సరాల జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఆమెను స్మరించుకునే కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రాణీ దుర్గావతి నారీ శక్తికి ప్రతీక అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల భారతి వనవాసీ కల్యాణ పరిషత్ విద్యా ప్రముఖ్ రామచంద్రయ్య, ఇతర వక్తలు రాణి దుర్గావతి ధైర్య సాహసాలను కొనియాడారు. మొగల్ సామ్రాజ్యంలోని అక్బర్ మాల్వాను ఓడించే ప్రయత్నంలో బాణంతో తన కుడి కంటికి గాయమైనా.. కుడి భుజానికి తీవ్రమైన రక్తస్రావం జరిగి ప్రాణాపాయ స్థితి ఏర్పడిన సందర్భంలోనూ వీరోచితంగా పోరాడిన ఘట్టాలను కళ్లకు కట్టినట్లు ఈ పుస్తకంలో వివరించారని పేర్కొన్నారు. హిందీ నుంచి తెలుగులోకి పుస్తకాన్ని అనువదించిన తాడేపల్లి హనుమాన్ ప్రసాద్ సైతం ప్రసంగించారు. వనవాసీ కల్యాణ పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రి శివరాంజీ, నరసింహారెడ్డి, చలపతి, భాగ్యనగర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

నేడు నారాయణగూడలో నిరసన దీక్ష

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలు చెల్లించాలని ఈనెల 29వ తేదీన నారాయణగూడలోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద నిరసన దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిరసన దీక్ష పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యా సంవత్సరం పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామంటూ కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయని అన్నారు. దీంతో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారని తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన దీక్షను విజయవంతం చేయడానికి విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల రామకృష్ణ, నెల్లి సత్య, వంశీవర్ధన్‌రెడ్డి, చైతన్య యాదవ్, అన్వర్, ఉదయ్ కుమార్, హరీష్, అరుణ్, లెనిన్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న ఆటో డ్రైవర్లు కౌశల్ సమీర్ తదితరులు

కాచిగూడ: రాష్ట్రంలో ఆటో, క్యాబ్ డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల రాష్ట్ర కాంగ్రెస్ చైర్మన్ కౌశల్ సమీర్ అన్నారు. సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. డ్రైవర్ల సంక్షేమం కోసం కిలోమీటర్ ధర పెంచాలని, డ్రైవర్లకు రూ.12వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. కార్పొరేట్ కంపెనీల దోపిడీ, బైక్ ట్యాక్సీల మీద చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల వాహనాల కట్టడితో పాటు ఇటీవల ఉబర్ యాజమాన్యం నడుపుతున్న ఉబర్ బస్ షెటిల్ వాటిపై మంత్రితో చర్చించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ నవంబర్ 5వ తేదీలోపు అన్ని సంఘాల నాయకులు, రవాణా శాఖ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలు ప్రకటిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పింగిలి సంపత్ రెడ్డి, తుమ్మ రాజశేఖర్ రెడ్డి, రుద్రాక్ష మల్లేష్, కోట అనిత, హనుమంతరెడ్డి, మెరుగు నాగేష్, బి.సత్యనారాయణ, తప్పెట్ల యాదగిరి, గొంటి విక్రం తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1,77,560

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం హుండీ డబ్బులను లెక్కించారు. కార్యనిర్వహణాధికారి ఎం.దేవనాథం మాట్లాడుతూ రూ.1,77,560 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. నవంబర్ 2వ తేదీ నుంచి కార్తీకమాస ప్రత్యేక పూజలు ఉంటయాన్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయకుండా రోడ్డు ఎలా వేస్తారు.?

- జీజేపీ సికింద్రాబాద్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్
- జీహెచ్‌ఎంసీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు స్థల పరిశీలన
- ఆందోళనకు దిగిన వివేకానందనగర్‌లోని బాధితులు


జీహెచ్‌ఎంసీ అధికారులు స్థల పరిశీలన రాగా అడ్డుకొని ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు


మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేస్తున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి: పేదలకు నాయ్యం చేయకుండా రోడ్డు నిర్మాణం చేపట్టవద్దని బీజేపీ సికింద్రాబాద్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని వివేకానందనగర్‌లో రోడ్డు వేసేందుకు ఇటీవల పేదల ఇళ్లను కూల్చారు. సోమవారం కూల్చిన స్థలం నుంచి రోడ్డు వేసేందుకు జీహెచ్‌ఎంసీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు స్థల పరిశీలన వచ్చారు. ఇది గమనించిన బాధితులు వారిని అడ్డుకొని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న వినయ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో కలసి మాట్లాడారు. పేదలకు న్యాయం చేయకుండా రోడ్డు ఎలా వేస్తారని అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

బాధితులతో వెళ్లి మంత్రి పొన్నంను కలిసిన వినయ్..

అనతరం బాధితుల పక్షాన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఇందిరమ్మ పథకంలో బాధితులు ఇళ్లు కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ బాధితులు ఎంబీ కృష్ణ, శ్యామ్‌సుందర్, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, తిలక్‌బాబు, బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు ఉమేష్, సాయి, అశోక్, జగదీశ్, బాబ్జీ, పున్నా సత్యనారాయణ, ఎం.రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతు సోకు చూడయ్యో..!

- సదర్ ఉత్సవాలకు భారీ దున్నలు సిద్ధం
- హరియాణా, గుజరాత్ నుంచి నగరానికి చేరిక
- సందడి చేయనున్న నేషనల్ చాంపియన్‌షిప్ దున్నలు


సదర్ ఉత్సవాలకు వచ్చిన దున్నలను ప్రదర్శిస్తున్న ఏబీవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: దీపావళి పర్వదినం సందర్భంగా యాదవులు నగరంలో నిర్వహించే సదర్ ఉత్సవాలలో హరియాణా, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన భారీ దున్నలు సదర్‌లో అలరించనున్నాయి. నవంబర్ 2న నగరంలో నిర్వహించే సదరు ఉత్సవాలలో దున్నలు పాల్గొనే విధంగా ముషీరాబాద్‌కు చెందిన అఖిల భారత యాదవ మహాసభ (ఏబీవైఎం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ హరియాణా నుంచి ప్రత్యేక వాహనంలో ముషీరాబాద్‌కు రప్పించారు. అందులో పలు పేర్లతో ఉన్న దున్నలు గోలు (7 ఏళ్లు), షేర్ (8 ఏళ్లు), గుజరాత్‌కు చెందిన శ్రీకృష్ణ (7ఏళ్లు), విధాయక్ (8ఏళ్లు) వచ్చాయి. ఈ దున్నలు భారీ ఆకారంలో ఉండటంతో అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

గోలు దున్నా..



ఆరు అడుగుల ఎత్తు, 1800 కిలోల బరువు ముర్రా జాతికి చెందిన గోలు దున్నా నేషనల్ చాంపియన్‌షిప్ పశువుల ప్రదర్శన పోటీలలో రెండు సార్లు చాంపియన్‌షిప్ విజేతగా నిలిచింది. రూ.5లక్షల రివార్డు సైతం పొందింది. దీని యజమాని నరేందర్ సింగ్ ముర్రా జాతిని ప్రొత్సహిస్తూ ప్రత్యేకంగా పెంచడంతో ఆయనను గుర్తించి పద్మశ్రీ అవార్డుతో భారత ప్రభుత్వం సత్కరించింది.

షేక్ దున్నా..

షేక్ దున్నా భారీ ఆకారంలో ఉండటంతో పాటు పశుమేళా చాంపియన్‌షిప్ పోటీలలో పలుమార్లు అవార్డులు పొందింది. గుజరాత్‌కు చెందిన శ్రీకృష్ణ దున్నా సైతం పశుమేళ ప్రదర్శనలో బహుమతులను పొందింది.



విధాయక్ దున్నా..



విధాయక్ దున్నా 1700 కిలోల బరువుతో ఆరు అడుగుల ఎత్తు, గంభీర ఆకారంలో ఉండటంతో పాటు ప్రత్యేక అవార్డులను పొందింది. ఈ దున్నలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు సార్లు స్నానం చేయిస్తారు. 20 లీటర్ల పాలు తాగించడంతో పాటు యాపిల్స్, డ్రైఫ్రూట్స్, అరటిపండ్లు, బెల్లం తదితర వాటిని ఆహారంగా ఇస్తారు.

యాదాద్రి కలెక్టర్‌గా హనుమంత రావు నియామకంపై హర్షం



టీబీఎస్‌ఎస్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు

నల్లకుంట: యాదాద్రి జిల్లా కలెక్టర్‌గా మంతిప్రగడ హనుమంతరావును నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్‌ఎస్) అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు హర్షం వ్యక్తం చేశారు. నీతి నిజాయితీ, నిస్వార్థ సేవలతో ప్రజల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్న ఒక ఐఏఎస్ అధికారిని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా నియమిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

మదర్సా నుంచి విద్యార్థి అదృశ్యం


షేక్ రిజ్వాన్ (ఫైల్)

కాచిగూడ: హరాస్‌పెంటలోని మదర్సా నుంచి ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన షేక్ వజీర్ కుమారుడు షేక్ రిజ్వాన్ (14) హరాస్‌పెంటలోని మదర్సాలో అరబిక్ చదువుతున్నాడు. ఆదివారం మదర్సా నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వివిధ ప్రాంతాల్లో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. మదర్సా నిర్వాహకుడు సిద్దిఖీ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మభ్యపెట్టే పార్టీలను ప్రక్షాళన చేయాలి


సదస్సులో మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాష్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రస్తుత రాజకీయాల ప్రక్షాళనే ఓంకార్‌కు నిజమైన నివాళి అని బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ అన్నారు. కుల, మత, ప్రాంతీయ తత్వాలతో ప్రజలను మభ్యపెడుతున్న పార్టీలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయాలు మార్క్సిజం, అంబేడ్కర్ ఆలోచన విధానం అనే అంశంపై సదస్సు జరిగింది.

◆ ఈ సందర్భంగా నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ... ప్రజల ఓట్లతో గెలిచి చట్టసభలను శాసించిన పార్టీలు ప్రజలకు అనుకూలమైన పాలన చేయకుండా రాజకీయాలను కలుషితం చేస్తున్నాయని విమర్శించారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ... తరతరాలుగా దోపిడీ పెట్టుబడిదారి వర్గాల ఆర్థిక విధానాలతో శ్రామికవర్గ ప్రజలను దోపిడీకి గురి చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైదంశెట్టి రమేష్, వనం సుధాకర్, మారోజు సునీల్ కుమార్, తుడుం అనిల్ కుమార్, తాండ్ర కళావతి, తుకారం నాయక్, అంగడి పుష్ప, విమల తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత నిర్వహణకు కార్పొరేటర్ చొరవ

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో వారాంతపు సంత నిర్వహించుకోవడానికి చేయూతనివ్వాలని కూరగాయాల వ్యాపారులు డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని రెడ్‌బిల్డింగ్ చౌరస్తా వద్ద ప్రతి మంగళవారం కూరగాయాల సంత నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పోలీసులు అభ్యంతరం చెప్పారు. దీంతో వ్యాపారులు సోమవారం స్థానిక కార్పొరేటర్‌ను కలిసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మార్కెట్‌ను నిర్వహించుకుంటామని కార్పొరేటర్, ట్రాఫిక్ పోలీసులకు హామీ ఇచ్చారు. వారి హామీపై కార్పొరేటర్ చొరవ తీసుకొని ట్రాఫిక్ అధికారులతో చర్చించి సంత నిర్వహించుకునేలా మార్గం సుగమం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డిలతో పాటు కూరగాయాల వ్యాపారులు ఉన్నారు.


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కూరగాయాల వ్యాపారులు

దేశ వ్యాప్తంగా బీసీ కులగణన నిర్వహించాలి

కాచిగూడ: తెలంగాణ తరహాలోనే దేశ వ్యాప్తంగా జనగణనలో భాగంగా బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ కులగణనపై అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరిని వెల్లడించాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బీసీ కులగణన చేస్తామని చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇప్పుడు పూర్తిగా విస్మరించిందన్నారు. దేశ జనగణనలో కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలన్నారు. సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50శాతం పరిమితిని ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చట్టసభలలో బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలి..

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో ఢిల్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రేణుకాఎల్లమ్మకు పూజలు


పూజలో కార్పొరేటర్ ఉమా

కాచిగూడ: రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూ దుర్గానగర్ బస్తీకి నూతన కమిటీ ఏర్పాటు


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్

అంబర్‌పేట: న్యూ దుర్గానగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికయ్యింది. సోమవారం బస్తీలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.వెంకటేష్‌గౌడ్, ప్రధాన సలహాదారుడిగా బి.బాలనర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నర్సింహగౌడ్, చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ కె.దుర్గయ్య, ఉపాధ్యక్షులుగా వి.నర్సింహ, జి.కుర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.మల్లేష్, కోశాధికారులు జి.శివకృష్ణ, ఎల్.యాదగిరిగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.శంకర్, ఎం.సంతూ, కార్యదర్శులుగా బి.శ్రీకాంత్, ఎల్.స్వామి, సంయుక్త కార్యదర్శులుగా పి.వెంకటేష్, ఓ.మహేశ్, ఎస్‌కే చాంద్‌పాషా, సలహాదారులుగా వెంకన్న పంతులు, ఇతర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సీఎంఆర్‌ఎఫ్‌ను చెక్కులను అందజేస్తామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు రూ.4,22,000 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జైసింహ, కవాడిగూడ, రాంనగర్ డివిజన్ల అధ్యక్షులు వల్లాల శ్యాంయాదవ్, శంకర్‌ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీకాంత్, సంతోష్, సాయిచాణక్యరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కళాశాలకు ఇంటర్ కాలేజ్ క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్


చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విద్యార్థులను అభినందిస్తున్న అంబేడ్కర్ కళాశాల యాజమాన్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ 2024–25ను బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల కైవసం చేసుకుంది. అందులో విద్యార్థులు సిద్ధు, ఆంజనేయులు, సాయి వర్ధన్, భరత్‌కుమార్, ఆనంద్, హేమంత్‌లు 45 నిమిషాలలో, షర్మిల, హోమిక, నాగమణిలు 58నిమిషాలలో 10 కిలోమీటర్లను పరిగెత్తి మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ క్రాస్ కంట్రీ మెడలిస్ట్ మిస్టర్ నళిని మోహన్, ప్రొఫెసర్ రాజ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ శ్రావణ్, పాండు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.